సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



బందీలుగా మారి..

జిల్లా మత్స్యకారులు శ్రీలంకలో చిక్కుకుపోయారు. విడిపించాలని కోరుతున్నారు.

- 8లో



లాడ్జిలో మృతదేహం

శ్రీకాకుళంలోని లాడ్జిలో మృతదేహం కలకలం రేపింది. రెండు రోజులుగా మృతదేహం అలాగే ఉంది.

- 8లో

ఇంజనీరింగ్ ఆరో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం ఏపీజే అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల ఆరో సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 13 తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. 200 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పరీక్షలు పర్యవేక్షిస్తున్నారు.

న్యూస్‌రీల్

3వ తేదీ లోపు సెల్ఫ్ రిపోర్టు తప్పనిసరి

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీఈఏపీ సెట్–2024 రెండో విడతలో కౌన్సెలింగ్‌లో సీటు లభించిన విద్యార్థులు ఈ నెల 3వ తేదీలోపు సెల్ఫ్ రిపోర్టు చేయాల్సి ఉంటుంది. లేదంటే సీటు కోల్పోతారు. చాలా మంది మొదటి విడత కౌన్సెలింగ్‌లో సీటు వచ్చినా కళాశాల మార్పునకు ఆప్షన్లు ఎంపిక చేసుకున్నారు. ఈ విద్యార్థులు ప్రస్తుతం సీటు వచ్చిన కళాశాలలో చేరాల్సి ఉంటుంది. జిల్లాకు సంబంధించి నాలుగు కళాశాలలు ఉండగా, కన్వీనర్ కోటాలో 2154 సీట్లు ఉండగా, 1903 ప్రవేశాలు జరిగాయి. రెండో విడత సీట్లు ప్రవేశాలు పూర్తయ్యాక స్పాట్ ప్రవేశాలకు ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ జారీ చేయనుంది.

చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి



పురుషోత్తపురం వద్ద గల ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టుని పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

ఇచ్ఛాపురం: ఒడిశా, ఆంధ్రా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పోలీసులకు సూచించారు. ఆయన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించాక మొదటి సారి పురుషోత్తపురం ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టుని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఈబీ సిబ్బందితో మాట్లాడుతూ ఒడిశా నుంచి అక్రమంగా నిషేధిత పదార్థాలు అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు చేయాలన్నారు. అనంతరం పట్టణ, రూరల్, కవిటి పోలీస్ స్టేషన్లను సందర్శించారు. సంబంధిత రికార్డులను తనిఖీలు నిర్వహించారు. పోలీసులకు అవసరమైన సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో సీఐ ఇమ్మాన్యుయేల్‌రాజు ఎస్‌ఐలు వి.సత్యనారాయణ, ఎన్.లక్ష్మణరావు, కె.రాము పోలీస్ సిబ్బంది, ఎస్ఈబీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఈసెట్ తుదివిడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఈసెట్ –2024 తుది విడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైనట్లు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, సహాయ కేంద్రం కోఆర్డినేటర్ జి.దామోదర్‌రావు తెలిపారు. వివరాలు గురువారం తెలియ జేశారు. పాలిటెక్నిక్ డిప్లమా పూర్తిచేసిన వారికి రెండో ఏడాది ఇంజినీరింగ్‌లో చేరే అవకాశం లభిస్తుందని అన్నారు. డిగ్రీ గణితం సబ్జెక్టుగా పూర్తిచేసిన వారికి సైతం సెట్ రాసి ఉంటే రెండో ఏడాది ఇంజినీరింగ్‌కు అవకాశం లభిస్తుందని వివరించారు. ఆన్‌లైన్ పద్ధతిలో కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. మూడో తేదీలోపు ఆన్‌లైన్ నమోదు, ఫీజు చెల్లింపు పూర్తిచేయాలని తెలిపారు. ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఆప్షన్ల ఎంపిక 2వ తేదీ నుంచి 4వ తేదీ మధ్య ఉంటుందని అన్నారు. ఐదున ఆప్షన్ల మార్పు, 8వ తేదీన సీట్లు అలాట్‌మెంట్, 9వ తేదీ నుంచి 13వ తేదీ మధ్య కళాశాలలకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని అన్నారు. కౌన్సెలింగ్ ఫీజు బీసీ, ఓసీలకు రూ. 1200, ఎస్సీ, ఎస్టీలకు రూ. 600గా చెప్పారు. నోటిఫికేషన్ మేరకు ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని అన్నారు.

నిత్యావసర వస్తువుల ధరల స్థిరీకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో నిత్యావసర వస్తువుల ధరలను స్థిరీకరించడానికి మార్కెట్‌లో సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో స్పెషల్ కౌంటర్లు ప్రారంభించామని, ఈ కౌంటర్లలో అధిక నాణ్యత కలిగిన కందిపప్పు, బియ్యం అందుబాటు ధరలకు విక్రయిస్తారని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ కేంద్రాల్లో కందిపప్పు (దేశవాళీ రకం) కిలో రూ.160 నుంచి 150, బియ్యం (ఫైన్ స్టీం బియ్యం కిలోకు రూ.49 నుంచి రూ.48, ఫైన్ రాబియ్యం కిలోకు 48 నుంచి 47 నిర్ణయించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రైతు బజార్లు, ఇతర షాపులలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.


సహకార సంఘాల అభివృద్ధిపై సమీక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: సహకార సంఘాల అభివృద్ధి అవసరమని, వీటి ప్రగతికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. డీఎల్‌బిసి, డీసీడీసీ కమిటీలతో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన గురువారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో మంజూరైన గోడౌన్ల ప్రస్తుత పరిస్థితి, పురోగతిపై చర్చించారు. వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధిపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

పింఛన్లపై కూటమి కత్తి

కూటమి ప్రభుత్వం కనిపించని కత్తి పట్టుకుని తిరుగుతోంది. తమకు వ్యతిరేకంగా ఎవరైనా నోరెత్తితే నిర్దాక్షిణ్యంగా పింఛన్లు తెగ నరుకుతోంది. ముఖ్యంగా విపక్ష శ్రేణుల గొంతు నొక్కేందుకు పింఛన్ల తీసివేతను ఆయుధంగా వాడుతోంది. ప్రభుత్వంపై విమర్శను అనర్హతగా పరిగణిస్తూ సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తోంది. జూన్‌లో జిల్లాలో ఉన్న పింఛన్ల సంఖ్యకు ఆగస్టు నాటికి మిగిలిన పింఛన్ల సంఖ్యకు భారీ తేడా కనిపించడమే అందుకు నిదర్శనం. పింఛన్ల పండగంటూ ఊరూరా హడావుడి చేస్తూ బాధితుల రోదనలు ఎవరికీ వినిపించకుండా చేస్తున్నారు.





S.No	District	No. of Pensions Rele
1	2	3
1	KRISHNA	240939
2	SRIKAKULAM	318017
3	EAST GODAVARI	240595
4	YSR	264014
5	ANAKAPALLI	262624
6	VIZIANAGARAM	280352
7	CHITTOOR	270619
8	NANDYAL	219863
9	DR.B.R. AMBEDKAR KONASEEMA	242200
10	ANNAMAYYA	222313
11	PALNADU	278219
12	VISAKHAPATNAM	163210
13	TIRUPATI	267772
14	KURNOOL	243337
15	GUNTUR	257390
16	NTR	234143
17	PARVATHIPURAM MANYAM	143398
18	SRI POTTI SRIRAMULU NELLORE	311540
19	BAPATLA	232045

ఆగస్టు జూలై నెలల్లో పింఛన్‌దారుల సంఖ్యలో తేడా

15	Pathapatnam	Kothuru	10680	10621	55
16		L.N.peta	5456	5414	42
17		Meliyaputti	8823	8747	76
18		Pathapatnam	10031	9970	61
		Sub Total	41175	40895	280
19	Narasannapeta	Jalumuru	9651	9579	72
20		Narasannapeta	10739	10656	83
21		Polaki	10175	10115	65
22		Saravakota	8487	8409	78
		Sub Total	39052	38754	258
23	Srikakulam	Gara	11800	11716	84
24		Srikakulam	12544	12452	92
25		Srikakulam (U)	10533	10444	89
		Sub Total	34877	34612	265
26	Amadalavalasa	Amadalavalasa	7536	7504	32
27		Amudalavalasa (U)	4897	4871	26
28		Burja	7526	7495	31
29		Ponduru	11245	11125	120
30		Sarubujjili	5382	5346	36
		Sub Total	36586	36341	245
31	Etcherla	Etcherla	12599	12518	81
32		G.sigadam	8934	8872	62
33		Laveru	11093	11006	87
34		Ranastalam	11392	11291	101
		Sub Total	44018	43685	331
	Grand Total		319147	316654	2493



- ఎడాపెడా పింఛన్లు తీసేస్తున్న కూటమి ప్రభుత్వం
- ఈ ఏడాది జూన్ నాటికి జిల్లాలో ఉన్న పింఛన్లు 3,19,702
- ఆగస్టు ఒకటి నాటికి 3,18,017
- రాజకీయ అక్కసుతోనే పింఛన్ల ఏరివేత
- తగ్గుతున్న పింఛన్లపై అధికారుల పొంతన లేని వివరణలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : నెల మారుతుంటే పింఛన్ల పంపిణీలో అర్హుల సంఖ్య తగ్గిపోతోంది. నెలనెలా ఇదే పరిస్థితి. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక పింఛన్ల సంఖ్య మరీ ఆశ్చర్యకరంగా తగ్గిపోతోంది. అధికారులను వివరణ అడుగుతుంటే వింతవింత సమాధానాలు పొంతన లేకుండా చెబుతుండడం ప్రభుత్వంపై అనుమానాలకు తావిస్తోంది. ఒకేసారి తీసేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని దశల వారీగా పింఛన్ల తీసివేత కార్యక్రమం పెట్టుకున్నారు. తమ పార్టీకి ఓటేయలేదనో, వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులనో కక్ష పెట్టుకుని అన్యాయంగా పింఛన్లు ఆపేస్తున్నారు.

- పోలాకి మండలం బెలమర పోలవలసకు చెందిన చింతు రమణమ్మకు వితంతు పింఛను వస్తుంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2008 అక్టోబర్ 24న ఆమెకు పింఛను మంజూరైంది. అప్పటి నుంచి ఆమెకు పింఛను అందుతూ వస్తోంది. కానీ, ఇప్పుడా పింఛన్‌ను ఆపేశారు. వాళ్ల అబ్బాయి సాక్షి విలేకరి కావడం, ఆయనకు గ్రామంలో కొంతబలం ఉండటాన్ని తట్టుకోలేక అధికారులపై ఒత్తిడి చేసి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆపించేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి ఆమెకు పింఛను నిధులు విడుదలయ్యాయి. ఆన్‌లైన్‌లో ఎలాంటి అభ్యంతరాలు చూపించ లేదు. కానీ, మౌఖికంగా ఆదేశించడంతో గురువారం పంపిణీ చేయకుండా ఆపేశారు. దీనిపై రచ్చ రచ్చ జరుగుతోంది. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ సీరియస్‌గా తీసుకోవడంతో వ్యవహారం ముదిరింది.
- కవిటి మండలంలో 10మందికి పింఛను ఆపేశారు. వీరంతా బయటికి తెలిసిన వారు. తెలియని వారి లెక్క ఇంకెంతో చెప్పలేం. అయితే, స్థానిక నాయకులు జోక్యం చేసుకుని అధికారులను నిలదీస్తుండటంతో శుక్రవారం వారందరికీ ఇచ్చేస్తామని హామీ ఇచ్చారు. ఏం జరుగుతుందో చూడాలి.

వీరే కాదు జిల్లా వ్యాప్తంగా ఇంకా చాలా మంది బాధితులు ఉన్నారు. బయట పడితే కక్ష సాధింపులకు దిగుతారేమోనని, కుటుంబ సభ్యులపై ఆ ప్రభావం పడుతుందేమోనని భయపడుతున్నారు. సామరస్యంగా అడిగి చూద్దాం.. అప్పటికీ సమస్య పరిష్కరించకపోతే రోడ్డెక్కుదామన్న ఆలోచనలో ఉన్నారు.

అధికారుల వింత వివరణలు

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక పింఛన్లు తగ్గిపోతూ వస్తుండటంపై సర్వత్రా ఆరోపణలు వస్తున్నాయి. మొన్నటి ఎన్నికల్లో ఆ పార్టీకి పనిచేయలేదని, తమకు వ్యతిరేకంగా ఎన్నికల్లో పనిచేశారనే అక్కసుతో కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. దీంతో అధికారులకు లోపాయికారీగా ఎమ్మెల్యేలు ఆదేశాలిస్తున్నారు. మౌఖికంగా చెప్పి పింఛన్లు తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. పింఛన్లు ఎందుకు ఆపకూడదని కొందరికి కొన్నిచోట్ల నోటీసులు కూడా ఇచ్చారు. ఇంత జరుగుతున్నా జిల్లాలో ఎక్కడా పింఛన్లు తొలగించడమే లేదని అధికారులు సమాధానమిస్తున్నారు. పత్రికల్లో వచ్చే కథనాలకు వింత వివరణలు ఇస్తున్నారు. పింఛన్లు తగ్గిపోవడం వెనక చావులు, మైగ్రేషన్‌లు తప్ప మరో కారణం లేదని చెప్పుకొస్తున్నారు. ఒక వైపు తొలగింపులు లేవంటూనే మరోవైపు తొలగించేందుకు నోటీసులు ఇచ్చిన దాఖలాలు ఉన్నాయి.

● పొంతన లేని లెక్కలు

పత్రికల్లో వార్తలు వచ్చాక అధికారులు లిఖిత పూర్వకంగా వివరణలు ఇస్తున్నారు. అంతవరకు బాగానే ఉంది. ఆ లెక్కల్లో ఎక్కడా పొంతన ఉండటం లేదు. ఉదాహరణకు జూలై నెలలో 3,19,147 మంది పింఛన్లకు గాను 3,16,654 మందికి పంపిణీ చేశామని పేర్కొన్నారు. 2,493 మందికి పంపిణీ జరగలేదని నివేదికల్లో చూపించారు. పంపిణీ చేయని వాటిలో 1607 మంది చనిపోయిన వారు ఉన్నారని, మరో 886 మంది టెంపరరీ మైగ్రేషన్‌లో ఉన్నట్టు లెక్కలు తయారు చేశారు. ఈ లెక్కనైతే ఆగస్టు నాటికి 3,16,654మంది మాత్రమే లబ్ధిదారులుగా ఉండాలి. పోనీ, టెంపరరీ మైగ్రేషన్‌లో ఉన్న వారంతా వచ్చేశారు అనుకుంటే.. లెక్క 3,17,540అవుతుంది. వీరు మాత్రమే ఆగస్టు నాటికి పింఛన్లు లబ్ధిదారులు అవుతారు. కానీ అధికారులు ఆగస్టు ఒకటో తేదీ నాటికి 3,18,017మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నట్టుగా నివేదికల్లో చూపించారు. మరీ, ఈ లెక్క ఎలా పెరిగిందో అధికారులకే ఎరుక. అలాగని కొత్తగా పింఛన్లు మంజూరు చేసిన దాఖలాలైతే లేవు. వచ్చే సెప్టెంబర్‌కు ఇంకెంతమందిని తగ్గిస్తారో తెలియని పరిస్థితి నెలకుంది.

50 ఏళ్లకు పింఛన్ ఎక్కడ..?

జిల్లాలో 50ఏళ్లు పైబడిన వెనకబడిన వర్గాలకు పింఛన్లు మంజూరు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. 50 ఏళ్లకే పింఛను వస్తుందన్న ఆశతో చాలా మంది కూటమికి ఓట్లేశారు. దాంతో ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు భారీగా లబ్ధిపొందారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీల జోలికి పోవడం లేదు. ఆర్థిక కష్టాలున్నాయంటూ ప్రజలకు పరోక్ష సంకేతాలు పంపిస్తున్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకైతే జిల్లాలో 50 ఏళ్లకు పైబడి...60ఏళ్లు లోపు జిల్లాలో 3, 5, 537మంది ఉన్నారు. వీరంతా చంద్రబాబు చెప్పినట్టుగా అమలు చేస్తే పింఛను లబ్ధిదారులు అవుతారు. ఇప్పుడున్న పరిస్థితి చూస్తుంటే అసలుకే మోసం వచ్చినట్టు కనబడుతోంది.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



బాధితులకు పార్టీ తరపున సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తదితరులు

టెక్కలి: రెడ్‌బుక్ పేరుతో టీడీపీ నాయకులు కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆందోళన పడవద్దని, అందరికీ అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ భరోసానిచ్చారు. ఎన్నికల ఫలితాల అనంతరం టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళి మండలం ఎం.నర్సాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు యడ్ల ఈశ్వరి, జామి భారతి తదితరులపై టీడీపీ కార్యకర్తలు విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ తరఫున ఒక్కొక్కరికీ రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. దీంతో గురువారం మబగాంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు కృష్ణదాస్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ చేతుల మీదుగా బాధితులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి జెడ్పీటీసీ పాల వసంత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కోత సతీష్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కె.జగన్నాయకులు, జేసీఎస్ కన్వీనర్ ఎం.భాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు ఎస్.వీరాస్వామి, రాములమ్మ, ఎంపీటీసీ ఎస్.రాజు, కె.అజయ్, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

104 పశువులు స్వాధీనం



కంచిలి: మండలంలోని లక్ష్మీపురం గ్రామం వద్ద గల పాతాళేశ్వర ఆలయం వెనుక పక్క ఖాళీ స్థలంలో మూగజీవాల అక్రమ రవాణాకు సిద్ధం చేస్తుండగా.. స్థానిక పోలీసులు గురువారం రాత్రి దాడి చేశారు. ఇక్కడి నుంచి పశువులను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఆకస్మికంగా దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ పశువులకు సరైన ఆహారం, నీరు పెట్టకుండా వాహనాల్లో ఎక్కించి హైదరాబాద్‌లోని గో మాంసం విక్రయించే చోటకు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇక్కడ పోలీసులు దాడిచేసిన సమయంలో గొల్లకంచిలి గ్రామానికి చెందిన వంజరాన జనార్ధన, మరో ఏడుగురు కలిసి ఉన్నారు. వీరు 104 పశువులను రవాణా చేయడానికి సిద్ధం చేయగా, నిందితులను అదుపులోకి తీసుకొని, పశువులను స్వాధీనం చేసుకొన్నారు. దీనిపై స్థానిక ఎస్‌ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మీకు మీరే.. మాకు మేమే

- నా పని ఎమ్మెల్యేకు లేదు.. ఎమ్మెల్యే పని నాకు లేదు
- ఎచ్చెర్ల ఎమ్మెల్యేను ఉద్దేశించి ఓ బీజేపీ నాయకుడి వాట్సాప్ మెసేజ్

రణస్థలం: ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా ఎన్.ఈశ్వరరావు గెలుపు వెనుక పనిచేసిన ఓ కీలక నాయకుడు ఇప్పుడు అదే ఎమ్మెల్యే వైఖరితో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. లావేరు మండలంలోని బెజ్జిపురం పంచాయతీ మాజీ సర్పంచ్ ఇజ్జాడ శ్రీనివాసరావు ఈశ్వరరావు గెలుపు కోసం తీవ్రంగా పనిచేశారు. అలాంటి వ్యక్తి గురువారం సాయంత్రం వాట్సాప్‌లో పెట్టిన మెసేజ్ నియోజకవర్గంలో తీవ్ర సంచలనమైంది. నా పని ఎమ్మెల్యేకి లేదు, ఎమ్మెల్యే పని నాకు లేదు.. అంటూ ఎమ్మెల్యేతో తలెత్తిన విభేదాన్ని బహిరంగపరిచారు. పార్టీని పటిష్టం చేయడానికి పనిచేసిన వ్యక్తి పరిస్థితి ఇలా మారిపోవడంతో నియోజకవర్గమంతా ఇదే టాపిక్ నడుస్తోంది. లావేరు మండలానికి చెందిన మరో నాయకుడికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల మనస్తాపం చెంది ఈ మెసేజ్ పెట్టినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషించుకుంటున్నాయి.



ఇజ్జాడ శ్రీనివాసరావు పెట్టిన వాట్సాప్ మెసేజ్

ఇన్‌చార్జి డీఆర్‌ఓగా అప్పారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారిగా ఫారెస్టు సెటిల్‌మెంటు ఆధికారి ఎం.అప్పారావుని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నియమించారు. ఇప్పటి వరకు డీఆర్‌ఓగా ఉన్న ఎం.గణపతి రావు జూలై 31న ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఈ పోస్టు ఖాళీ అయ్యింది. దీంతో ఇన్‌చార్జిగా ప్రస్తుతం జిల్లాలో ఎస్‌డీసీ కేడర్‌లో ఉన్న ఎం.అప్పారావుకు బాధ్యతలు అప్పగించారు.



నరసన్నపేట మండలం మడపాంలో వంశధార నదిలో టీడీపీ నేతలు వేసిన ఇసుక పోగులివి. అక్రమ బాగోతమంతా రాత్రి పూట కానిచ్చేస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.5వేలకు విక్రయిస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.



శ్రీకాకుళం రూరల్ మండలంలోని కరజాడ గ్రామంలో నాగావళి నది తీరంలో టీడీపీ నేతలు అడ్డగోలుగా తవ్వకాలు జరిపి, అక్రమంగా నిల్వ చేసిన ఇసుక పోగులివి. ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనాల రాకపోకలకు గ్రామస్తులతో ఇబ్బంది కలగడంతో ఫిర్యాదు చేశారు. తప్పని పరిస్థితులు సిబ్బంది సైతం స్పందించి అప్పటికప్పుడు దొరికిన లారీని సీజ్ చేశారు. నిల్వ చేసి ఉన్న ఇసుక పోగులను సీజ్ చేశారు.

శ్రీకాకుళం టౌన్‌లోని శాంతినగర్ కాలనీకి పక్కనే ఉన్న నాగావళి ఎగువ భాగంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపిన ప్రదేశమిది. ఇక్కడ తవ్వకాలతో ఎగువ భాగంలో శాంతి నగర్ కాలనీకి, దిగువ భాగంలో పెద్ద రెల్లి వీధికి ప్రమాదకరం కానుంది. కొత్త బ్రిడ్జికి పక్కనే అడ్డగోలుగా తవ్వకాలు జరిపి, ఇసుకను తరలించేస్తున్నారు. దీని వలన బ్రిడ్జికి ముప్పు వచ్చే అవకాశం ఉంది. గోతులు కూడా ప్రాణాపాయంగా మారుతున్నాయి.



నదుల కంట కన్నీరు

- తీరాన్ని తవ్వేస్తున్న అక్రమార్కులు
- నదుల్లో నీరు ప్రవహిస్తున్నా ఆగని అక్రమ తవ్వకాలు
- శ్రీకాకుళం, నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాల్లో ఇసుక దందా
- రోజుకు రూ.లక్షల్లో సంపాదిస్తున్న టీడీపీ నాయకులు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

జిల్లాలోని నదీ తీరాలను టీడీపీ నాయకులు తవ్వుకుపోతున్నారు. జలుమూరు మండలం పర్లాం, నరసన్నపేట మండలం లుకలాం, చేనువలస, పోలాకి మండలం దోల, పల్లిపేట, సరుబుజ్జిలి మండలం సవలాపురం, ఆమదాలవలస మండలం దూసి, హిరమండలం, కల్లేపల్లి, శ్రీకాకుళం టౌన్‌లోని శాంతినగర్ కాలనీకి పక్కనున్న నాగావళి తీరం ఎగువ, దిగువ ప్రాంతాల్లో ఇష్టానుసారం ఇసుక తవ్వి విక్రయిస్తున్నారు. స్థానికుల ఫిర్యాదులతో అధికారులు స్పందిస్తూ చర్యలు తీసుకోవడం, దొరికిన కాడికి వాహనాలు సీజ్ చేయడం, అక్రమ తవ్వకాలు జరిగిన చోట బాటలకు అడ్డుగా ట్రెంచ్‌లు తవ్వడం వంటివి చేస్తున్నారు. అధికారులు పట్టుకున్న రెండు మూడు రోజులు ఆగిపోతున్నారు. ఆ తర్వాత మళ్లీ యథావిధిగా అక్రమ తవ్వకాలను కానిచ్చేసి, దర్జాగా ఇసుకను విక్రయిస్తున్నారు. ఒక్కో ఏరియాకు ఒక్కో ధర నిర్ణయించి రూ. ఇసుకను విక్రయిస్తున్నారు. దొరికితే దొంగ.. దొరక్కపోతే దొర అన్నట్టుగా ఇసుక దందా జిల్లాలో సాగిపోతోంది.

నదీ తీరాలు ధ్వంసం

జిల్లాలో వంశధార, నాగావళి నదీ తీరంలోని చాలా చోట్ల ఇదేరకంగా ఏదో ఒక సందర్భంలో అక్రమ తవ్వకాలు జరిపి ఇసుకను దోచేస్తున్నారు. రోజుకి రూ. లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. విచిత్రమేమిటంటే ఒడిశాలో కురిసిన వర్షాలకు నదుల్లో వరద నీటి ప్రవాహం ఉన్నప్పటికీ తవ్వకాలు ఆపడం లేదు. తీర ప్రాంతంలో తవ్వకాలు జరిపి అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. కొన్నిచోట్ల అధికారులకు తెలిసే జరుగుతుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. పగలైతే పని జరగడం లేదని రాత్రిళ్లు దందా సాగిస్తున్నారు. ఈ విషయంలో సంబంధిత సిబ్బందిపై కూడా ఆరోపణలు వస్తున్నాయి.

తీర ప్రాంతంలో ప్రమాదకర పరిస్థితులు

ప్రస్తుతం నదుల్లో వరద నీరు ప్రవహిస్తుండటం వల్ల నదుల మధ్యలో కాకుండా తీరంలో అడ్డగోలుగా తవ్వకాలు జరుపుతున్నారు. దీంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. ఆ ప్రాంతంలో ఇసుక పోగులేస్తున్నారు. ఎవరైనా తెలియని వారు అటువైపు వెళ్లి దిగితే అంతే సంగతులు. తీరంలో తవ్వకాలు జరపడంతో కోతకు గురై సమీప ప్రాంతాలు, గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది.

క్లుప్తంగా

1300 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

కాశీబుగ్గ: మందస మండలం కొండలోగాం గ్రామంలో నాటుసారా స్థావరాలపై సెబ్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. సోంపేట సబ్ సీఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో 1300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. మందస మండలంలో నాటు సారా తయారీను నివారించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు.

కంబకాయలో పిచ్చికుక్క స్వైర విహారం


కుక్క దాడిలో గాయపడి ఆస్పత్రిలో చేరిన కంబకాయ వాసులు

నరసన్నపేట: మండలం కంబకాయలో పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. ఈ కుక్క దాడిలో గురువారం బైరి కృష్ణారావు, అల్లు రాజబాబు, గొండు నీలమ్మ, చెట్టు సరోజనిలతో పాటు మరొకరు గాయపడ్డారు. మూడు రోజుల కిందట ఇదే కుక్క కొరగాన నారాయణ, గుజ్జిడి నాగేశ్వరరావు, తాన్ని రాజారావులకు చెందిన మూడు ఆవులు, రెండు మేకలపై దాడి చేసి గాయపరచగా అవి మృతి చెందినట్లు గ్రామస్తులు పాగోటి భరద్వజ్ తెలిపారు. గాయపడిన వారిని స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చి ఇంజెక్షన్లు వేయించారు.

రైలు నుంచి జారి పడి మహిళకు గాయాలు


ప్రమాదంలో గాయపడిన సంతోషి

జలుమూరు: తిలారు రైల్వేస్టేషన్‌లో ట్రైన్ ఎక్కుతూ మహిళ జారి పడి తీవ్రగాయాలపాలయ్యారు. గురువారం ఉదయం పాతపట్నానికి చెందిన బోహార సంతోషి అనే మహిళ విశాఖకు వెళ్లేందుకు పాసింజర్ ట్రైన్ ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడిపోయారు. అదే సమయంలో ట్రైన్ కదలడంతో పట్టాల్లో కాలు ఇరుక్కుపోయి నుజ్జునుజ్జయిపోయింది. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు.

ఒడిశాతో బొల్లినేని మెడిస్కిల్స్ ఎంవోయూ


అవగాహన ఒప్పందం చేసుకుంటున్న దృశ్యం

పర్లాకిమిడి: ఒడిశా విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చేందుకు ఆ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా తొలుత గజపతి జిల్లా విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆ జిల్లా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ సమక్షంలో అధికారులతో ఎంవోయూ కుదుర్చుకున్నామన్నారు. ఇప్పటివరకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎనిమిది సంవత్సరాలుగా 9,200 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, 8800 మంది విద్యార్థులకు వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఒడిశా ప్రభుత్వం తమ సంస్థతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావడంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గజపతి జిల్లా ఉపాధి కల్పన అధికారి సౌభాగ్య ఎస్ఆర్, త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల చట్టాలు అమలుచేయాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: విభిన్న ప్రతిభావంతుల చట్టాలు, వారి సంక్షేమాలు అమలు చేయాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు తెలిపారు. గురువారం జిల్లాలో కోర్టు ఆవరణలోని న్యాయ సేవ సదన్‌లో ప్రభుత్వ అధికారులు, ఎన్‌జీఓలు అధికారుల తో సమావేశం నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులు బాధితులు ఎదుర్కొంటున్న సవాళ్లు, అడ్డంకులు, అంతరాల గురించి ప్రభుత్వ అధి కారులతో చర్చించారు. విభిన్న ప్రతిభావంతులకు సామాజిక హోదాను కల్పించాలని అన్నారు.

సుశాంత్ సెంచరీ మిస్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన స్టార్ క్రికెటర్ నంబల్ల సుశాంత్ తన అద్భుత బ్యాటింగ్ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. తాజాగా విశాఖపట్నంతో జరిగిన మ్యాచ్‌లో 88 పరుగులతో సెంచరీ చేజార్చుకున్నాడు. వైఎస్సార్ కడప జిల్లాలో కేఓఆర్ఎం కాలేజ్ క్రికెట్ మైదానంలో బుధవారం విశాఖపట్నంతో మొదలైన కీలక మ్యాచ్‌లో సుశాంత్ మరోసారి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీకాకుళం జిల్లా సుశాంత్ కీలక ఇన్నింగ్స్ ఆడి రాణించడంతో 66.2 ఓవర్లలో 212 పరుగులకు ఆలౌటై గౌరవప్రదమైన స్కోరు చేసింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఈ లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్ 170 బంతుల్లో 15 బౌండ్రీల సహాయంతో 88 పరుగులు చేసి అవుటయ్యాడు. జిల్లాకే చెందిన మరో ఆటగాడు కల్యాణ్‌కుమార్ 72 పరుగులతో రాణించి ఆకట్టుకున్నాడు.

వలస వెళ్లి.. బందీలుగా మారి



- చేపల వేటకెళ్లి శ్రీలంకలో చిక్కుకున్న జిల్లా వాసులు
- స్వస్థలానికి తీసుకురావాలంటూ కుటుంబ సభ్యుల విన్నపం

శ్రీకాకుళం రూరల్:

పొట్టకూటి కోసం వలస వెళ్లారు. కాసింత అదనపు ఆదాయం వస్తుందని కన్నవారిని, ఉన్న ఊరిని విడిచిపెట్టి పొరుగు రాష్ట్రంలో పనిచేసుకుంటున్నారు. చేపల వేట కోసం సముద్రంలోకి వెళ్లి అనుకోని పరిస్థితుల్లో శ్రీలంక కోస్టుగార్డులకు జిల్లా మత్స్యకారులు చిక్కారు. ప్రస్తుతం అక్కడ జైలులో ఉన్నారు. వారి క్షేమ సమాచారం తెలియక కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతున్నారు. వారిని ఎలాగైనా కాపాడాలని స్థానిక ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు.

శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని పెదగనగళ్లవానిపేట పంచాయతీ పరిధిలోని చినగనగళ్లవానిపేటకు చెందిన గనగళ్ల కొర్లయ్య, దాసరి వెంకయ్యలు తమిళనాడులో పనిచేస్తున్నారు. జూన్ 25న వారు తమిళనాడులోని మద ఏపీఎస్ 5138 అనే బోటుతో చేపల వేటకు బయల్దేరారు. సముద్రంలో ఆటుపోట్ల కారణంగా అలా ముందుకు వెళ్లిపోయి శ్రీలంక కోస్టుగార్డులకు చిక్కారు. విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో ఎలాగైనా వారిని విడిపించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే గ్రీవెన్స్‌లోనూ, మత్స్యశాఖ అధికారులకు గడిచిన రెండు రోజులుగా వినతి పత్రాలు అందజేశారు. ప్రస్తుతం శ్రీలంకలో జైలు జీవితం గడుపుతున్న కొర్లయ్య, వెంకయ్యల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిసిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారిని వెంటనే విడిపించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను, రాజకీయ నాయకులకు మత్స్యకార నాయకులు చీకటి గురుమూర్తి, కోనాడ నర్సింగరావు కోరుతున్నారు.


మత్స్యశాఖ అధికారులకు కలిసిన కొర్లయ్య, వెంకయ్య కుటుంబ సభ్యులు

చేపల వేటే ఆధారం



నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మేము చేపల వేటపైనే ఆధారపడి జీవిస్తున్నాం. నా భర్త కొర్లయ్య 6వ నెలలో తమిళనాడు నాగపట్నంకు చేపలు వేటకు వెళ్లాడు. చేపల వేట సాగిస్తుండగా మార్గం మధ్యలో వారి రూటు మారిపోయి శ్రీలంక బోర్డుకు చేరుకున్నారు. అధికారులు ఎలాగైనా నా భర్తను తిరిగి తీసుకురావాలి.

– గనగళ్ల అరుణ, చినగనగళ్లవానిపేట

దుర్భర జీవితం అనుభవిస్తున్నారు



శ్రీలంక జైలులో నా భర్త వెంకయ్య బందీగా ఉన్నాడు. నాకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. నా భర్త పరిస్థితి ఏమీ బాగులేదు. అక్కడ దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. ఆయనకు అనారోగ్య సమస్యలు ఉన్నాయి. ఎలాగైనా తీసుకురావాలి. పిల్లలు చాలా కంగారు పడుతున్నారు.

– దాసరి లక్ష్మి, చినగనగళ్లవానిపేట

అప్పట్లో వైఎస్ జగన్ 22 మందిని విడిపించారు



వైఎస్ జగన్ అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు 22 మంది మత్స్యకారులు పాకిస్తాన్‌లో చిక్కుకున్నారు. వారిని జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత బయటకు తీసుకువచ్చారు. అందరికీ రూ.5 లక్షలు చొప్పున అందించారు. ఇప్పుడు టీడీపీ నాయకులు కూడా శ్రీలంకలో చిక్కుకున్న మా వారిని విడిపించి తీసుకురావాలి.

– కోనాడ నర్సింగరావు, జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు

'వైద్యులు నిర్లక్ష్యం విడనాడాలి'

- మంత్రి అచ్చెన్నాయుడు


మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, పక్కనే కలెక్టర్ స్వప్నిల్ దినకర్

టెక్కలి/టెక్కలిరూరల్: టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి రూపు రేఖలు మారుస్తానని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. కలెక్టర్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన గురువారం ఆస్పత్రిలో అభివృద్ధి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వైద్యులు నిర్లక్ష్య వైఖరి విడనాడాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక్కడ ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేస్తామని తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ...ఆస్పత్రిలో సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అలాగే ఆస్పత్రిలో అత్యవసరమైన ఫ్యాన్లు ఇతర సామగ్రిని దాతలు అందజేయాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. దీనిపై కొంత మంది స్పందించారు. ఆస్పత్రిలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, పోస్టుమార్టం విభాగం ఏర్పాటు చేయాలని, సిటీ స్కానింగ్‌కు జనరేటర్ సదుపాయం కల్పించాలని, ఖాళీగా ఉన్న 14 స్టాఫ్ నర్స్ పోస్టులతో పాటు వివిధ విభాగాల్లో ఇతర పోస్టులను భర్తీ చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.సూర్యారావు నివేదించారు. అంతకు మునుపు టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశా రు. సమావేశంలో డీసీహెచ్ఎస్ రాజ్యలక్ష్మి, డీఎంఅండ్‌హెచ్ఓ బి.మీనాక్షి, ఆర్డీఓ సుదర్శన్ దొర, నాయకులు కె.కిరణ్, బి.శేషు, కె.హరిప్రసాద్, కె.లవకుమార్ తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధికి చర్యలు


పర్యాటక శాఖ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పర్యాటక అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పర్యాటక మండలి సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి గురువారం నిర్వహించారు. శాలిహుండం మాన్యుమెంట్ కోసం వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్రీముఖలింగం టెంపుల్ గురించి ఎవరెవరు ఏం చేస్తారో ఆరా తీశారు. అరసవల్లి అభివృద్ధికి సంబంధించి జిల్లా నుంచి కేంద్రానికి ప్రతిపాదనలు పంపించామని, కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని అధికారులు తెలిపారు. శ్రీముఖలింగేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి దేవదాయ శాఖ రూ.4 కోట్లు మంజూరు చేయగా టెండర్లు పూర్తయినట్లు అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్ చెప్పారు. వజ్రపుకొత్తూరు వద్ద టూరిజం ప్రాజెక్టు ఏర్పాటుకు భూ సమస్య ఉండగా.. సంబంధిత రైతులతో చర్చించి ప్రాజెక్టు వస్తే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలియజేయాలని పలాస ఆర్డీఓను ఆదేశించారు. అమృత్ పార్క్ అభివృద్ధి చేసి థర్డ్ పార్టీకి ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గొట్టాబ్యారేజ్ వద్ద బోటింగ్ ఏర్పాటుకు పాయింట్ గుర్తించిట్లు నారాయణరావు చెప్పారు. భావనపాడు వద్ద పర్యాటక అభివృద్ధికి కావాల్సిన భూమి ఇస్తామని కలెక్టర్ చెప్పారు. ఇప్పిలి వద్ద పర్యాటక అభివృద్ధికి అక్కడ భూ సమస్యకు సంబంధించి జాయింట్ సర్వే చేయాలని కలెక్టర్ ఆర్డీఓను ఆదేశించారు. అలాగే డచ్ బిల్డింగ్, శాంతినగర్ పార్కు, గనగళ్లవానిపేట బీచ్, టెంపుల్ టూరిజంపై సమీక్షించారు. జిల్లా పర్యాటక ప్రాంతాలపై కాఫీటేబుల్ బుక్ తయారు చేయాలన్నారు. గనగళ్లవారిపేట వద్ద అభివద్ధికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాగరమాలలో ఫిషింగ్ జెట్టీల కోసం కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు మత్స్య శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు చెప్పారు.

గురుకుల విద్యార్థిని మృతిపై దర్యాప్తు

నందిగాం: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్యపై ఉన్నతాధికారులు దర్యాప్తు ప్రారంభించారు. గురుకులాల జిల్లా సమన్వయకర్త బాలాజీనాయక్ ప్రిన్సిపాల్, సిబ్బందితో మాట్లాడి ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. బుధవారం రాత్రి పలాస ఆర్డీఓ భరత్‌నాయక్ గురుకులాన్ని సందర్శించి సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.

అలాగే గురుకుల విద్యాలయ సంస్థల వైద్యుడు డాక్టర్ రాజేష్ అమరా వతి నుంచి గురుకులాన్ని సందర్శించి ఘటన జరిగి న తీరును, చనిపోయిన విధానం, తోటి విద్యార్థినులతో ఎలా మెలిగేది, వారి తల్లిదండ్రుల వివరాలు తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గురుకులాల సమన్వయకర్త మాట్లాడుతూ జరిగిన ఘటన బాధాకరమని, విద్యార్థిని మృతిపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని, ఘటనలో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కనిపించ డం లేదని తెలిపారు. హెడ్ ఆఫీస్ నుంచి వచ్చిన అ ధికారులు లోతుగా దర్యాప్తు చేపట్టి తప్పు జరిగి ఉంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతున్నందున కౌన్సెలింగ్ చేస్తామన్నారు. పలువురు బీజేపీ నాయకులు కూడా గురుకులాన్ని సందర్శించారు.

అలారం సెలైన్.. విజయం సాధించెన్

- అటల్ మారథాన్‌లో ఇప్పిలి స్కూల్ ఎంపిక


ఇప్పిలి జిల్లా పరిషత్‌లో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, సెలైన్ రిమైండర్

శ్రీకాకుళం రూరల్: ఏటా ఇండియాలో నిర్వహించే అటల్ మారథాన్ 2023–24కు గాను రాష్ట్రం తరఫున శ్రీకాకుళం రూరల్ మండలం ఇప్పిలిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికైంది. టాప్ 500లో ఈ పాఠశాల రెండోస్థానంలో నిలవడం విశేషమని స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎ.సుజాత గురువారం ఓ ప్రకటనలో తెలిపా రు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఉన్న ప్రాజెక్టులకు మాత్రమే దీనికి అవకాశం ఉంటుంది. ఈ అరుదైన అవకాశాన్ని ఇప్పిలి స్కూల్ విద్యార్థులు దుమ్ము నవీన్ కుమార్, జే.హాసినీ, ఎస్.హరి సింహాద్రి కైవసం చేసుకున్నారు.

ఎలా తయారు చేశారంటే..

ఆస్పత్రుల్లో పేషెంట్‌కు సెలైన్ ఎక్కిస్తున్నప్పుడు సెలైన్ అయిపోయిన వెంటనే చూసుకోకపోతే రోగి రక్తం సెలైన్ పైపులోకి వచ్చేస్తుంది. దీన్ని నివారించడానికి 5 ఎంఎల్ సెలైన్ మిగిలి ఉండగానే అలారం (సెలైన్ రిమైండర్) మోగేలా వీరు ప్రాజెక్టు తయారు చేశారు. ఇంతటి విజయం సాధించినందుకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్, డీఈఓ, తిరుమల చైతన్య గైడ్ టీచర్ ఎస్.ఉమామహేశ్వరితో పాటు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

భయపెట్టిన స్కార్పియో


దెబ్బ తిన్న స్కార్పియో వాహనం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న స్కార్పియో వాహనం కేశవరావుపేట కూడలి కింతలిమిల్లు వద్ద గురువారం భయపెట్టింది. బండి ఒక్కసారిగా అదుపు తప్పి ఎడమ వైపు రోడ్డు నుంచి కుడివైపు రోడ్డు డివైడర్ పైనుంచి వెళ్లి సర్వీస్ రోడ్డు ఇనుప కంచెను ఢీ కొట్టింది. దీంతో స్కార్పియో ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. మరో పక్క ప్రధాన రోడ్ల నుంచి వాహనాల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో వాహనంలో డ్రైవర్‌తో పాటు, మరో ఇద్దరు ఉన్నారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఎచ్చెర్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరు పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య క్రమబద్ధీకరించారు.

లాడ్జిలో మృతదేహం


శ్లాబ్ హుక్‌కు ఉరివేసుకున్న యువకుడు

రెండు రోజులుగా అతని మృతదేహం ఉరికి వేలాడుతూనే ఉంది. ఇంటికి వెళ్లిపోయి ఉంటాడని అతనితో పనిచేస్తున్న వాళ్లు, పనిలో ఉండిపోయి ఉంటాడని కుటుంబ సభ్యులు భావించడంతో రెండు రోజుల పాటు అతని మరణవార్త ఎవరికీ తెలియలేదు. ఎంతకూ లాడ్జికి రాకపోవడంతో ఆ యాజమాన్యం వారు ఆరా తీసి వెతుకుంటే.. ఆ భవనం మీదనే ఉరికి వేలాడుతూ కనిపించాడు.

- రెండు రోజుల తర్వాత గుర్తించిన వైనం
- మృతుడు బూర్జ మండలం అన్నంపేట వాసి

శ్రీకాకుళం క్రైమ్, బూర్జ: జిల్లాకేంద్రంలోని కిమ్స్ ఆస్పత్రి మార్గం దత్తాత్రేయ గుడి సమీపంలోని ఓ లాడ్జి రెండో అంతస్తులో యువకుడి మృతదేహం కలకలం రేపింది. రెండో పట్టణ సీఐ, స్థానికులు, మృతుని కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. బూర్జ మండలం అన్నంపేట గ్రామానికి చెందిన కరణం మహేష్ (25) గత కొంతకాలంగా దత్తాత్రేయ గుడి సమీపంలోని స్టూడియో ఇన్ లాడ్జిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్నాడు. దీంతో పాటు కల్యాణ మండపాలకు సంబంధించి డెకరేషన్ పనులు కూడా చేస్తుంటాడు. ఇతనికి ఇంకా వివాహం కాలేదు. గత రెండు రోజులుగా విధులకు రాకపోవడం చూసిన లాడ్జి యాజమాన్యం వారి కుటుంబ సభ్యులకు గురువారం ఉదయం ఫోన్ చేసి మహేష్ ఊరేమైనా వచ్చాడా.. అంటూ అడిగారు. దీనికి మహేష్ కుటుంబీకులు రాలేదని చెప్పి వెంటనే అన్నంపేట గ్రామం నుంచి నగరంలో ఉన్న లాడ్జి వద్దకు వచ్చారు.


కరణం మహేష్ (ఫైల్)

అనుమానం వచ్చి..

మృతుని సోదరుడు తేజేశ్వరరావు చుట్టుపక్కల పరిసరాలు వెతకడమే కాక అనుమానం వచ్చి లాడ్జి రెండో అంతస్తులో నిర్మాణంలో ఉన్న గది వైపు వెళ్లారు. వెళ్లిన మరుక్షణమే తీవ్ర దుర్వాసన రావడంతో లోపలికి వెళ్లి చూడగా శ్లాబ్ హుక్‌కు ఉరి వేసుకున్న మహేష్ కనిపించాడు. వెంటనే లాడ్జి యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలికి రెండో పట్టణ సీఐ, ఎస్ఐలు ఉమామహేశ్వరరావు, హరికృష్ణలు, క్లూస్ టీమ్ చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించి చుట్టుపక్కల దర్యాప్తు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. మృతుని సోదరుడు వచ్చి గమనించేంత వరకు లాడ్జి యాజమాన్యం రెండు రోజులుగా మృతదేహం ఉన్నట్లు గుర్తించకపోవడమేంటని స్థానికులు, మృతుని కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. మృతుడికి తండ్రి చిన్నప్పుడు, తల్లి మంగమ్మ ఉన్నారు. అన్నయ్యకు, అక్క చెల్లెమ్మకు వివాహమైంది. ఈయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

ఆలయ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశం

అరసవల్లి: సూర్యనారాయణస్వామి ఆలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన కృష్ణమాచార్యులు, జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్యామలరావులపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కాలంలో దినసరి వేతనదారుల ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలపై కృష్ణమాచార్యులపై శాఖాపరమైన విచారణ జరిగిన విషయం తెలిసిందే. అయితే డిప్యూటీ కమిషనర్ సుజాత నివేదిక ఆధారంగా కృష్ణమాచార్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని విశాఖపట్నం కరకచెట్టు పోలమాంబతల్లి ఆలయం ఈఓకు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఈ అక్రమ వసూళ్ల వ్యవహారంలో అరసవల్లి ఆలయం జూనియర్ అసిస్టెంట్ శ్యామలరావు ప్రమేయం స్వల్పంగా ఉన్నందున ఆయనపై కూడా శాఖాపరంగా క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయానికి కొత్తగా జూనియర్ అసిస్టెంట్‌గా విజయనగరం పైడితల్లి అమ్మవారు ఆలయం రెగ్యులర్ ఉద్యోగి కేవీ రమణమూర్తిని డిప్యూటేషన్ పై నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారంపై అరసవల్లి ఈఓ ఎస్.చంద్రశేఖర్‌ను 'సాక్షి' సంప్రదించగా కృష్ణమాచార్యులు వ్యవహారం సీరియస్‌గా ఉందని ఈయనపై మాత్రమే కఠిన చర్యలు తీసుకోనున్నారని పేర్కొన్నారు.

శ్రీకాకుళంలో స్టేట్ సాఫ్ట్‌బాల్ మీట్

- ఈ నెల 17 నుంచి 19 వరకు పోటీలు


సాఫ్ట్‌బాల్ సాధనలో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్–2024 పోటీలకు శ్రీకాకుళం ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ పోటీలు ఆగస్టు 17 నుంచి 19వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ(ఆర్ట్స్) కళాశాల మైదానం వేదికగా జరగనున్నాయి. రాష్ట్రంలో ఉమ్మడి 13 జిల్లాల నుంచి క్రీడాకారులు, కోచ్ మేనేజర్లు 496 మంది ఈ స్పోర్ట్స్ మీట్‌కు హాజరుకానున్నారు. వీరితోపాటు టోర్నీ రిఫరీలు, టెక్నికల్ సిబ్బంది, స్థానిక పీడీ, పీఈటీలు, నిర్వహణ కమిటీ, వలంటీర్లు, సాఫ్ట్‌బాల్ సంఘ రాష్ట్ర,జిల్లా ప్రతినిధులు కలిపి మొత్తం 644 మంది ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరికి స్థానికంగా వసతి, భోజన ఏర్పాట్లు కల్పించనున్నారు. ఇక్కడ రాణించిన వివిధ జిల్లాల క్రీడాకారులను జాతీయ పోటీల్లో పాల్గొనే ఏపీ రాష్ట్ర జట్లకు ఎంపిక చేయనున్నారు.

గెలుపే లక్ష్యంగా..

ఈ టోర్నీలో శ్రీకాకుళం జిల్లా జట్లు గెలుపే లక్ష్యంగా సాఫ్ట్‌బాల్ సంఘ జిల్లా బాధ్యులు చర్యలు తీసుకుంటున్నారు. త్వరితగతిన ఎంపికలను నిర్వహించి, ప్రాబబుల్స్ జట్లను ఖరారు చేసిన అనంతరం వారికి పది రోజులపాటు శిక్షణ శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించారు. వసతి, భోజన సదుపాయాలు కల్పించి నాణ్యమైన కోచ్‌ల పర్యవేక్షణలో తర్ఫీదును అందించాలని భావిస్తున్నారు. ఇందుకు జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారుల తల్లిదండ్రులతో కూడా మాట్లాడాలని, వారి సాయాన్ని కూడా తీసుకోవాలని యోచిస్తున్నారు. అందరి సహకారంతో పోటీలను విజయవంతం చేసేలా జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి నరసింహారామరాజు, చైర్మన్ బడగల హరిధరరావు, ప్రధాన కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి, కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు, ఎంవీ రమణ నేతృత్వంలో స్థానిక పెద్దలు, దాతల చేయూతతో పోటీలను నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనికి జిల్లా ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరుతున్నారు.

4న జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు

జిల్లా జూనియర్స్, సబ్‌జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు ఈనెల 4వ తేదీన జరగనున్నాయని శ్రీకాకుళం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, ప్రధాన కార్యదర్శి సిగిలిపెల్లి లక్ష్మిదేవి తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్)కళాశాల మైదానం వేదికగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. జూనియర్స్ విభాగంలో 2007 జనవరి ఒకటి తర్వాత, సబ్‌జూనియర్స్ విభాగంలో 2010 జనవరి ఒకటి తర్వాత జన్మించిన క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, సాఫ్ట్‌బాల్ ఐడీ కార్డుతో హాజరుకావాలని వారు కోరారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో సాఫ్ట్‌బాల్ సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి ఎంవీ రమణ వద్ద రిపోర్ట్ చేయాలని, మరిన్ని వివరాలకు 94410 11391 నంబర్‌ను సంప్రదించాలన్నారు.